సాక్షి
చిత్తూరు
సోమవారం । 23 । జనవరి । 2023


చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,100

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,000
రిటైల్ వెండి గ్రాము	రూ.72

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	30	19
తిరుపతి	31	19
తిరుమల	26	16
గూడూరు	31	21
నగరి	31	20



గజ వాహనంపై పద్మావతి విహారం

తిరుచానూరు : పద్మావతి అమ్మవారు ఆదివారం సాయంత్రం గజవాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరాషాఢ నక్షత్రం సందర్భంగా గజవాహన సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు పోలీసు స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడ వచ్చని పేర్కొన్నారు.

గంగమ్మ ఆశీస్సుల కోసం..


క్యూలో వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లె: కోరిన కోర్కెలు తీర్చే తల్లి ఆశీస్సుల కోసం పేరుగాంచిన బోయకొండ గంగమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కోర్కెలు ఫలించిన భక్తు లు మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్ర మౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తులతో పోటెత్తిన కాణిపాకం




కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనార్థం భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో రూ.150, రూ.100, ఉచిత క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, గర్భిణులు, చంటి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక క్యూల్లో స్వామివారి దర్శనం కల్పించారు.

ప్లంబర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్: ప్లంబర్ కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ జిల్లా సహాయ సంచాలకులు కే.విజయప్రతాప్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సహకారంతో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ సమయంలో స్టేషనరీ, యూనిఫాంతోపాటు 15 కిలోమీటర్ల లోపు ఉన్న వారికి ఉచిత బస్సు పాస్ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ చదువుకున్న 18–35 ఏళ్ల వారు అర్హులని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 9700413939, 9000894035 నంబర్లను సంప్రదించాలని కోరారు.






కల్లాడు వద్ద సాగు చేసిన జలపినో హైబ్రిడ్ మిరప (ఇన్‌సెట్) విరగ్గాసిన పంట

కొత్త పంట.. లాభాల బాట

- విదేశాలకు ఎగుమతి అయ్యే జలపినో సాగు
- జలపినో (క్యాప్సికం) ఉత్పత్తులకు ముందే ధర నిర్ణయం
- అదనపు ఆదాయంగా అంతరపంటలు
- తోటవద్దే కొనుగోలు చేస్తున్న కంపెనీలు

పలమనేరు: మండలంలోని రైతులు వినూత్న ఆలోచనలతో కొత్త పంటలు పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. నడిమి కల్లాడు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి తన మూడున్నర ఎకరాల మెట్టపొలంలో గతంలో పలు రకాల పంటలను పండించాడు. పంట దిగుబడి, నాణ్యత బాగున్నా మార్కెటింగ్‌లో సమస్యలు ఎదురయ్యాయి. దళారులు, ధరలు తగ్గడంతో నష్టాలను చవిచూశాడు. దీంతో కొంత మంది రైతులతో కలిసి కొత్త వ్యవసాయ పంటలపై పొరుగునే ఉన్న తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ లాభసాటిగా ఉన్న జలపినో పంటపై అక్కడి రైతులను సంప్రదించి తగు సలహాలు సూచనలు తీసుకున్నాడు. సంబంధిత కంపెనీతో మాట్లాడి తన మూడున్నరెకరాల పొలంలో గత ఏడాది అక్టోబర్‌లో పంటను సాగుచేశాడు. ఇది ఐదు నెలల పంట. మొలకలు నాటిన రెండు నెలలకు దిగుబడి మొదలైంది. ప్రస్తుతం ఎకరానికి 12 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తోంది. కంపెనీ బైబ్యాక్ అగ్రిమెంట్ మేరకు టన్ను ధర రూ.20వేలుగా ఉంది. ఆ మేరకు ఎకరానికి రూ.3 లక్షలు వస్తోంది. మూడున్నర ఎకరాలకు దాదాపు రూ.10 లక్షల ఆదాయం వచ్చింది. పంటసాగు పెట్టుబడిగా ఎకరాకు రూ.లక్ష లెక్కన మూడున్నర ఎకరాలకు రూ.3.5లక్షలు ఖర్చుపోనూ (మల్చింగ్ పేపర్, కూలీలు) రూ.6.5 లక్షలు నికర లాభాన్ని గడించాడు.

విదేశాల్లో డిమాండ్ ఉన్న రకాలివే

క్యాప్సికంతో పాటు గెర్కిన్(దోస), బేబీకార్న్(మొక్కజొన్న), డ్రమ్‌స్టిక్(మునగ), వైట్ ఆనియన్, గుమ్మడి, సొర కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉంది. దీంతో పలు ప్రైవేటు కంపెనీలు ఇక్కడి రైతులతో అగ్రిమెంట్ చేసుకొని ఆ పంటలను పండిస్తున్నారు. వీటి కారణంగా రైతులకు గ్యారెంటీ ధర దక్కుతోంది. ఇలా ఉండగా ఇక్కడి రైతులు వినూత్నంగా సాగు చేస్తున్న పలు ఎగుమతి పంటలను కర్ణాటక రాష్ట్రానికి చెందిన రైతులు సైతం పరిశీలించి రైతులతో మాట్లాడి వాటిని సాగు చేసేందుకు సమయాత్తమవుతున్నారు. గతనెల 9న పలమనేరు మండలంలోని కల్లాడు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి జలపినో పంటను కలెక్టర్ హరినారాయణన్ సైతం చూసి సంబంధిత రైతును అభినందించారు. ఇలాంటి కొత్త వెరైటీలను రైతులు సాగుచేయాలని సూచించారు.


పలమనేరు మండలంలో జలపినో పంటను పరిశీలించి రైతును అభినందిస్తున్న కలెక్టర్ హరినారాయణన్ (ఫైల్)

అంతరపంటలు

జలిపినో పంటతో పాటు అరటి, అలసందను అంతర పంటలుగా సాగుచేశాడు. ఐదునెలల పాటు జలిపినో పూర్తి కాగానే ఆపై అరటి వచ్చేలా సాగుచేశాడు. ఇందులోనే అలసంద, బెండలాంటి పంటలను సైతం సాగు చేశాడు. ఓ పంట సాగునీటితోనే మిగిలిన పంటల అదనపు ఆదాయాన్ని పొందుతూసుబ్రమణ్యం రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నాడు

బైబ్యాక్ పాలసీతో ధర నిర్ణయం

విదేశాలకు ఎగుమతి చేసే పలు కంపెనీలు ముందుగానే ఇలాంటి పంటలను సాగు చేసే రైతులతో ఒప్పందం చేసుకుంటున్నాయి. ధర ఉన్నా లేకపోయినా నిర్ణయించిన ధరకు పంట మొత్తం ఇచ్చేలా అగ్రిమెంటు ఉంటుంది. ఇప్పుడు జలిపినో కిలో ధర రూ.20గా ఉంది. కంపెనీ వారే తోటల వద్ద కొచ్చి అక్కడే తూకాలను వేసి రైతు ఖాతాలోకి నగదును అప్పటికప్పుడే బదిలీ చేస్తున్నారు. దీంతో రైతులకు మార్కెట్ తీసుకెళ్లడం, మండీ కమీషన్లు, దళారులు బెడద తప్పింది.

అంతర్జాతీయ వ్యాపారం

సాధారణంగా జిల్లాలోని రైతులకు మిరప సాగు పరిచయమే. అయితే ప్రస్తుతం పలు రకాల కంపెనీలు మిరపలోనే నాటు మిరపతో పాటు బజ్జీమిరప, జలపినో క్యాప్సికంలో ఎల్లో, గ్రీన్, రెడ్ రకాలను ఇక్కడి రైతులు సాగు చేస్తున్నారు. వీటిని స్థానికంగా పెద్దగా ఉపయోగించకపోయినా కేవలం విదేశాలకు ఎగుమతి కోసం పలు బహుళజాతి కంపెనీలు ఈ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి. పలు రాష్ట్రాలకు చెందిన బహుళ జాతి కంపెనీలైన గుడ్‌గ్రీన్, హ్యాపీ చెఫ్, ప్రాంగెట, హాట్‌పెప్పర్, స్వీట్, మెజెట్టా, మైల్స్, నియో, పోకోపోకో, అమెరికన్ గార్డెన్‌లాంటి కంపెనీలు వీటితో సాస్, పికెల్స్, బ్రెడ్‌క్రీమ్, పెప్పర్ వంటివి తయారు చేసి పలుదేశాలకు ఎగుమతులు చేస్తున్నాయి. ఆన్‌లైన్ ద్వారా అమ్మకాలు జరిపే బిగ్‌బ్యాస్కెట్, అమెజాన్, ఆల్ఫాబెట్, అలిబాబా, ఈబే, రోబ్‌లెక్స్‌లాంటి వేదికల ద్వారా వ్యాపారాలు సాగుతున్నాయి.

డిమాండ్‌ను బట్టి సాగుచేయాలి



నేను గతంలో పలు కూరగాయల పంటలను వేసినా గిట్టుబాటు కాలేదు. అందుకు పొరుగునే ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో తిరిగి కొత్త పంటలపై అధ్యయనం చేశా. జలపినో పంటను సాగుచేస్తున్నా. ఎకరానికి రూ.2లక్షల నికర ఆదాయం గ్యారెంటీగా పొందుతున్నా. ఇప్పుడు వైట్ ఆనియన్ వేసేందుకు సిద్ధమవుతున్నా. రైతులు కాస్త విభిన్నంగా ఆలోచించాలి. అప్పుడే లాభాలను పొందగలం.

– సుబ్రమణ్యం రెడ్డి, రైతు, ఎగువ కల్లాదు గ్రామం

ఇప్పుడు సాంకేతికత పెరిగింది



సంప్రదాయ పంటల స్థానంలో విదేశాల్లో డిమాండ్ ఉన్న కొత్త వెరైటీలు చాలానే ఉన్నాయి. రైతులు కాస్త తెలివిగా ఆలోచించి ఏ పంటను పండిస్తే ఆదాయం బాగుంటుందో దాన్నే సాగుచేయాలి. బైబ్యాక్ పాలసీలో ధర ముందుగానే తెలుస్తుంది గాబట్టి దాని మేరకు ఎంత లాభం దక్కుతుందో తెలుస్తుంది. ఉత్పత్తి పెరిగితే మరింత లాభం ఉంటుంది.

– డా.కోటేశ్వరరావ్, ఉద్యానశాఖ ఏడీ, పలమనేరు


సుబ్రమణ్యంరెడ్డి పొలంలో పంటను పరిశీలిస్తున్న కర్ణాటక రైతులు


జలపినోలో అంతర పంటగా అరటి


హైబ్రిడ్ బజ్జీ మిరప రకాలు



విదేశాలకు ఎగుమతి అవుతున్న జలపినో బాటిల్స్


హైబ్రిడ్ ఎల్లో మిరప

దేశానికే ఆదర్శం సచివాలయం


బంగారుపాళెంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బంగారుపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని గనులు, భూగర్భ వనరులు, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. రూ.80 లక్షలతో నిర్మించిన బంగారుపాళెం 1,2 గ్రామ సచివాలయ భవనాలు, రూ 21.75 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఆదివారం సాయంత్రం మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మూడున్నరేళ్ల పాలనలో అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ప్రజలకు అవసరమైన సేవలను ఆయా ప్రాంతాలలోనే అందించాలన్న ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందేనన్నారు. ప్రజలకు అవసరమైన 500 రకాల సేవలను గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కేంద్రాలు, ప్రజా వైద్యానికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మసీదు అభివృద్ధికి కృషి

బంగారుపాళెం జామీయా మసీదు అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి హామీ ఇచ్చారు. గ్రామ సచివాలయాల ప్రారంభోత్సవం తరువాత మంత్రి మసీదును సందర్శించారు. మత పెద్దలు, ముస్లింలు మసీదు అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్పందించిన మంత్రి గతంలో షాదీమహల్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశామని, మసీదు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

గజబాధితులకు పరిహారం

మండలంలో ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు మంత్రి పరిహార చెక్కులను అందజేశారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో పంటపొలాలపై ఏనుగుల దాడుల కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమశేఖర్, సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యులు పద్మావతి, ఉష, టీటీడీ పాలకమండలి సభ్యుడు అశోక్‌కుమార్, జానపద కళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు పెయింటింగ్ పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని కేంద్రీయ విద్యాలయ-1లో ఈ నెల 23వ తేదీన జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ పి.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది ఈ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న సీబీఎస్‌ఈ, స్టేట్ బోర్డ్ స్కూల్స్ విద్యార్థులు పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. ఈ పోటీలు తిరుపతి, వెంకటగిరి, రేణిగుంటలోని కేంద్రీయ విద్యాలయాలతోపాటు, తిరుపతిలోని సిల్వర్ బెల్స్, భారతీయ విద్యాభవన్, లిటిల్ ఏంజెల్స్ స్కూల్స్‌లో నిర్వహించనున్నారు. ప్రతి ఏటా సెకండరీ, సీనియర్ సెకండరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులనుద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,158 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దర్శించుకున్నారు.


తిరుమలలో హైకోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్

ప్రశాంతంగా కానిస్టేబుల్ ప్రిలిమ్స్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40,102 మంది హాజరు
- దళారులను నమ్మి మోసపోవద్దు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీలు

చిత్తూరు అర్బన్: పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జరిగిన పరీక్షలకు మొత్తం 43,448 మంది అభ్యర్థులకు గానూ, 40,102 మంది హాజరయ్యారు. చిత్తూరులో 870, తిరుపతిలో 110 పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నోటిఫికేషన్ ఇవ్వగా.. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ప్రిలిమ్స్ నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో 12,196 మందికి గానూ 11,254 మంది హాజరయ్యారు. తిరుపతి జిల్లాలో 31,252 మందికి గానూ 28,848 మంది పరీక్షలు రాశారు. భారీ బందోబస్తు నడుమ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి ముందస్తు చర్యలు చేపట్టారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నాయుడు బిల్డింగ్స్‌లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. తిరుపతిలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఎస్వీఆర్ట్స్ కళాశాల, ప్రకాశం భవన్, చదలవాడ, మంగళం ఎస్వీ కళాశాల, అన్నమాచార్య కళాశాల కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఎస్పీలు వేర్వేరుగా మాట్లాడుతూ ఎక్కడా కూడా అనుమానాలకు తావులేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. జవాబు పత్రాలను పటిష్ట భద్రత మధ్య పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ దళారుల అవతారం ఎత్తే ఏ ఒక్కర్నీ నమ్మొద్దని.. అన్ని పరీక్షల్లో పాసైన వాళ్లకు ఉద్యోగం తప్పకుండా వస్తుందన్నారు. చిత్తూరులోని ఎస్వీ కళాశాల వద్ద రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చినందుకు ఓ అభ్యర్థి పరీక్ష రాయలేకపోయాడు.


తిరుపతి: పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న అభ్యర్థులు


తిరుపతి: తనిఖీకి వెళుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి


చిత్తూరు: పరీక్ష కేంద్రంలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి

● కండలేరులో 50.774 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 50.774 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,410 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 100, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు 30, హైలెవల్ స్లూయిజ్‌కు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

సాక్షి స్పెల్‌బీతో ప్రతిభకు పదును

● అధిక సంఖ్యలో హాజరైన విద్యార్థులు
● ఆంగ్లంలో రాణించేందుకు స్పెల్‌బీ సరైన వేదిక

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా, వారి ప్రతిభకు పదును పెట్టేందుకు సాక్షి స్పెల్‌బీ దోహదం చేస్తోంది. ప్రస్తుతం ఉన్నత విద్య అయినా, ఉన్నత కొలువైనా సాధించాలంటే ఆంగ్ల భాష తప్పనిసరి. ఇంగ్లీష్ భాషపై పట్టు, నైపుణ్యం, సామర్థ్యం, ఒడిసి పట్టుకుంటేనే నేటి తరం ఉన్నతంగా రాణిస్తుంది. ఇంగ్లీష్ భాషపై విద్యార్థుల్లో అవగాహన కల్పించి, వారిలో నైపుణ్యం, ఆసక్తిని పెంపొందించేందుకు ప్రతి ఏటా సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా స్పెల్‌బీ పరీక్షలు నిర్వహిస్తోంది. తద్వారా వారిలో దాగున్న ప్రతిభకు పదునుపెడుతోంది. ప్రాథమిక, క్వార్టర్, సెమీఫైనల్, ఫైనల్ నాలుగు దశల్లో స్పెల్‌బీ నిర్వహించి.. ఫైనల్‌లో సత్తా చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందిస్తోంది. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ వేఫీ, అసోసియేషన్ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తోంది. సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షలకు పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. ఎప్పటిలానే ఈ ఏడాది సైతం విద్యార్థులు ఈ పరీక్షకు అధిక సంఖ్యలో హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం తిరుచానూరు రోడ్డు, శ్రీనివాసపురంలోని హోలీ గ్రీన్ పాఠశాలలో స్పెల్‌బీ సెమీఫైనల్స్ నిర్వహించారు. ఇదివరకు పాఠశాల స్థాయి, జిల్లా స్థాయి(క్వార్టర్ ఫైనల్స్)లో జరిగిన ఈ పరీక్షలో విజేతలకు సెమీఫైనల్స్(మూడో రౌండు) పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు చిత్తూరు, వైఎస్సార్ కడప, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉపాధ్యాయులు హాజరయ్యారు.


స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నాలుగు కేటగిరీల్లో

సాక్షి స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షలు ఇలా

1, 2 తరగతులకు కేటగిరి	1
3, 4 తరగతులకు కేటగిరి	2
5, 6, 7 తరగతులకు కేటగిరి	3
8,9,10 తరగతులకు కేటగిరి	4

విభాగాలుగా లైవ్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో సత్తా చాటిన వారు ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు.


స్పెల్‌బీ పరీక్ష లైవ్‌లో..

పోటీ ప్రపంచానికి స్పెల్‌బీ సరైన వేదిక

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత విద్య, ఉన్నత కొలువులకు ఇంగ్లీష్ భాష తప్పనిసరి అని ఆయా పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు తెలిపారు. దీనికోసం చిన్నతనం నుంచే విద్యార్థులకు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించేలా తర్ఫీదు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగా సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షలు విద్యార్థులకు ఇంగ్లీష్ భాషపై పట్టుసాధించడానికి దోహదపడుతుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల ఉన్నత చదువుకు, ఆహ్లాదకరమైన పోటీతత్వం పెంపొందడానికి ప్రతి ఏటా సాక్షి మీడియా గ్రూప్ స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ వంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని సంతోషం వ్యక్తం చేశారు.

ఆత్మవిశ్వాసం రెట్టింపు



ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు ఇంగ్లీష్ భాష తప్పనిసరి. సామాజిక బాధ్యతతో పాటు విద్యార్థుల ఉన్నతికి బాటలు వేసేలా సాక్షి మీడియా గ్రూప్ స్పెల్‌బీ నిర్వహించడం అభినందనీయం. స్పెల్ బీ ద్వారా విద్యార్థులు ఇంగ్లీష్ భాషపై పట్టు, నైపుణ్యం సాధించగలుగుతారు. ఇంగ్లీష్ భాషను నలుగురిలో తప్పులు లేకుండా సరైన ఉచ్చారణతో మాట్లాడగలుగుతారు. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం రెట్టింపై ఉన్నతంగా రాణించగలుగుతారు.

–సి.వేణుగోపాల్‌రెడ్డి, చైర్మన్, హోలీగ్రీన్ స్కూల్, తిరుపతి

మొదటి స్థానమే లక్ష్యం



గత ఏడాది స్పెల్‌బీ ఫైనల్స్‌లో రెండో స్థానం సాధించాను. ఈ ఏడాది మొదటి స్థానం సాధించడమే లక్ష్యంగా సిద్ధమయ్యాను. స్పెల్‌బీ మెటీరియల్‌ను బాగా చదివాను. తెలియని కొత్త పదాలు, వాటి ఉచ్చారణను టీచర్లను అడిగి తెలుసుకున్నాను.

– ఈ.బినిత, 10వ తరగతి, వెంకటాచలం, నెల్లూరు జిల్లా

పలకడం తెలిసింది



స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనడం ద్వారా ఇంగ్లీష్ భాషలోని కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్ తెలుసుకున్నా. వాటితో పాటు ఆ పదాలను ఎలా పలకాలనే విషయాలను మా టీచర్లు నేర్పించారు. స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షను బాగా రాశాను. ఫైనల్‌కు చేరుకుంటాననే నమ్మకం ఉంది. అందుకే బాగా సాధన చేశాను.

– కె.దనీన్, 4వ తరగతి, చిత్తూరు

ఆంగ్లంపై ఆసక్తి



స్పెల్‌బీ పరీక్షకు ఈ ఏడాది తొలిసారిగా హాజరయ్యాను. పాఠశాల, క్వార్టర్ ఫైనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి సెమీ ఫైనల్‌కు చేరడం సంతోషంగా ఉంది. స్పెల్‌బీ ద్వారా ఆంగ్లీష్ భాషపై నాకు ఆసక్తి పెరిగింది. కొత్తకొత్త పదాలు తెలుసుకోవడంతో ఆ భాషపై పట్టు సాధించగలిగాను. థ్యాంక్స్ టు సాక్షి.

– తేజస్విని, 5వ తరగతి, కడప

స్పెల్లింగ్స్ నేర్చుకున్నా



నాకు ఇంగ్లీష్ అంటే ఇష్టం. ఇంగ్లీష్ బాగా చదువుతాను. స్కూల్ లెవెల్‌లో అన్ని పదాలకు స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. అయితే స్పెల్‌బీ ద్వారా కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్‌తో పాటు ఆయా పదాలను ఎలా ఉచ్చరించాలి అనే విషయాలు నేర్చుకున్నా.

– ఎం.మోనిష్‌రెడ్డి, 5వ తరగతి, తిరుచానూరు

ఆసక్తి పెరిగింది



స్పెల్‌బీ పరీక్షకు ప్రిపేర్ అయ్యే కొద్దీ ఆసక్తి పెరిగింది. స్పెల్‌బీ మెటీరియల్‌లో అనేక కొత్త కొత్త పదాలు ఉన్నాయి. వాటిని తెలుసుకోవడంతో పాటు తప్పులు లేకుండా రాసేందుకు సాధన చేశాను. వాటిని ఎలా పలకాలో టీచర్‌ను అడిగి తెలుసుకున్నా. ఇప్పుడు కొంచెం ధైర్యం వచ్చింది.

–సీఎంవి.బిందుశ్రీ, 3వ తరగతి, కడప

బాగా ప్రాక్టీస్ చేశాను



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షకు బాగా ప్రిపేర్ అయ్యాను. స్పెల్‌బీ మెటీరియల్‌లోని కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. ఈ పరీక్షలో రాణించి ఫైనల్‌కు చేరుకుని అక్కడ నా ప్రతిభను చాటుకోవాలనుకుంటున్నాను. భాషపై పట్టు సాధించేందుకు ఇది ఉపయోగపడుతోంది.

–సి.విష్ణుప్రియ, కడప

సామర్థ్యం పెరిగింది



ఇంగ్లీష్ భాషలో నాకు ప్రావీణ్యం పెరగడానికి స్పెల్‌బీ దోహదపడింది. అనేక కొత్త పదాలు తెలుసుకున్నా. ఈ స్పెల్‌బీ పరీక్ష ద్వారా ఇంగ్లీష్‌లో సరళంగా, తప్పులు లేకుండా మాట్లాడేందుకు దోహదపడింది. ఈ స్పెల్‌బీ నాలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించింది.

–కె.హర్షిణి, 7వ తరగతి, తిరుపతి

ఉభయదారుల దర్శనంపై ఆంక్షలు విధించం

● దేవదాయశాఖకు నివేదికలు పంపుతాం
● కాణిపాకం దేవస్థానం చైర్మన్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ దర్శన విషయంలో ఉభయదారులపై ఎలాంటి ఆంక్షలు విధించమని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని ఈఓ వెంకటేశు తెలిపారు. ఆదివారం దేవస్థానం అనుబంధ శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయంలో 14 గ్రామాల ఉభయదారుల సమావేశం నిర్వహించారు. దేశంలోనే ప్రముఖ ఆలయం కాణిపాకం విరాజిల్లుతోందని, దేశం నలుమూలల నుంచి భక్తులు అశేషంగా ఆలయానికి తరలి వస్తున్నారని తెలిపారు. ఉభయదారులు, అధికారు తరుపున, వీఐపీలు స్వామివారి దర్శనార్థం అధిక సంఖ్యలో వస్తున్నందున ఆలయంలో సామాన్య భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అలాగే అభివృద్ధి కుంటుపడుతోందని దేవదాయశాఖ కొన్ని సూచనలు ఇచ్చిందని పేర్కొన్నారు. వీఐపీలకు, ఉభయదారులకు దర్శనంలో సమయం కేటాయించే విషయమై అభిప్రాయాలు చెప్పాలని కోరారు. ఉభయదారులు మాట్లాడుతూ వందల సంవత్సరాల నుంచి ఆలయానికి ఆదాయం లేకున్న 14 గ్రా మాలకు చెందిన గ్రామీణ ప్రజలు ఉభయదారులుగా ఏర్పడి నిత్య పూజలు, తిరునాళ్లు చేశామన్నారు. ఇప్పుడు ఆలయం అభివృద్ధి చెందిన తరువాత ఉభయదారులకు దర్శనానికి సమయం కేటాయించాలనడం సబబు కాదన్నారు. దీన్ని ఒప్పుకోమని ముక్తకంఠంతో స్పష్టం చేశారు. అలాగే ఆలయంలో విధులు నిర్వహించే సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతు ఉభయదారులకు స్వామివారి దర్శనంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖకు పంపాలని ఈఓకు సూచించారు. ఈఓ మాట్లాడుతు అభిప్రాయాలు సేకరించాలని దేవదాయశాఖ అధికారులు సూచించారని, ఉభయదారులు స్పష్టం చేసిన విషయాలు నివేదికలు పంపుతామని తెలిపారు. ఉభయదారుల సంఘం అధ్యక్షుడు ఈశ్వర్‌బాబు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, గణేష్ ప్రసాద్‌రెడ్డి, మాజీ చైర్మన్ జగన్నాథరెడ్డి, ఉభయదారులు రవిరెడ్డి, చిన్నారెడ్డి, ఆలయ ఏఈఓలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట


మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

● వాలీబాల్ ఓపెన్ గ్యాలరీ నిర్మాణం
● సౌత్‌ఇండియా వాలీబాల్ పోటీలను తిలకించిన మంత్రి పెద్దిరెడ్డి

బంగారుపాళెం: క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న బ్లిట్జ్ సౌత్‌ఇండియా ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలను చివరి రోజు ఆదివారం సాయంత్రం మంత్రి తిలకించారు. మంత్రికి నిర్వాహకులు, బ్లిట్జ్ టెక్నికల్ అధికారి తులసిరెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా మాట్లాడుతూ, బంగారుపాళెం మండలం వాలీబాల్ క్రీడకు పెట్టింది పేరన్నారు. ఇక్కడ నుంచి తులసిరెడ్డి, జయప్రకాష్, అజయ్‌రెడ్డి, కుమార్ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించారని గుర్తుచేశారు. మరికొందరు క్రీడా కోటా కింద ప్రభుత్వ ఉద్యోగాలు పొందారన్నారు. బంగారుపాళెంలో వాలీబాల్ గ్యాలరీ నిర్మాణానికి సహకరించాలని మంత్రిని కోరారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ శాప్ నిధులతో వాలీబాల్ గ్యాలరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది కల్లా గ్యాలరీ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్జెంటీనా నుంచి వచ్చిన వాలీబాల్ కోచ్‌లు రూబిన్, జువాన్‌ను అభినందించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.నిర్వాహకులు మురారి, సుదర్శన్‌నాయుడు, హిమకర్‌రాజా పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి

పూర్తి కాలం పని చేసేలా చర్యలు తీసుకోండి

పుత్తూరు రూరల్: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న తమ 12 నెలల కాల వ్యవధిని పూర్తిగా కొనసాగించాలని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామికి కాంట్రాక్ట్ లెక్చరర్స్ వినతి పత్రం అందజేశారు. ఆదివారం పుత్తూరులోని ఆయన నివాసంలో కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి సమస్యలను వివరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు సాయి కిరణ్ మాట్లాడుతూ మూడేళ్లుగా కొనసాగుతున్న తమ కాల వ్యవధి ఈఏడు మార్చి నెల వరకు ఉందన్నారు. అయితే చివరి ఏడాదిలో 10 నెలలకే రెన్యూవల్ ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు. ఈ ఏడు జనవరి 31కి ముగియనున్న తమ కాల పరిమితిని ఫిబ్రవరి, మార్చి నెలలకు సైతం పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చేలా చూడాలని కోరారు. రెగ్యులర్ అధ్యాపకులకు వర్తించే సెలవులు తమకు వర్తింప చేయాలని, కాంట్రాక్టు అధ్యాపకులందరినీ క్రమబద్ధీకరించాలని కోరారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, నాయకులు సుగుణ, సుధాకర్, గంగిరెడ్డి, తంబయ్య, హిమబిందు, ప్రసాద్ పాల్గొన్నారు.


డిప్యూటీ సీఎం నారాయణస్వామికి వినతి పత్రం అందిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్స్

కారు దగ్ధం.. తప్పిన ప్రాణాపాయం

గంగవరం: బానెట్ నుంచి ఉన్నట్లుండి మంటలు చెలరేగడంతో కారు దగ్ధమైంది. అందులో ప్రయాణిస్తున్న వారు అప్రమత్తం కావడంతో ప్రాణాలతో బయటపడ్డారు. మండలంలోని పత్తికొండ వద్ద ఆదివారం ఈ ఘటన చేసుకుంది. వివరాలు.. కాణిపాకానికి చెందిన విక్రమ్‌రెడ్డి భార్య, ఇద్దరు పిల్లలతో కారులో బెంగళూరుకు బయలు దేరారు. పలమనేరు బెంగళూరు జాతీయ రహదారిపై పత్తికొండ సమీపంలో కారులో ఏదో కాలుతున్న వాసన వస్తుండడంతో విక్రమ్‌రెడ్డి రోడ్డు పక్కకు ఆపి, ముందర బానెట్ తెరిచి చూశాడు. అందులో మంటలు చెలరేగుతుండడాన్ని గమనించి వెంటనే భార్య, పిల్లలను కారు నుంచి బయటకు వచ్చేయాలని తెలిపారు. వారు వెలుపలికి వచ్చిన అనంతరం కారు నుంచి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తులు అక్కడికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం తెలుసుకున్న బాధితుల సమీప బంధువు, పలమనేరు ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి ఘటన స్థలం వద్దకు చేరుకుని విక్రమ్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



క్రికెట్ టోర్నీ విజేత బ్లాక్ బుల్స్ జట్టు

పులిచెర్ల(కల్లూరు) : మంగళంపేటలో పదిరోజులపాటు నిర్వహించిన సంక్రాంతి క్రికెట్ టోర్నీ విజేతగా బ్లాక్ బుల్స్ టీమ్ నిలిచింది. ఈ టోర్నీలో 32 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్స్‌లో వడ్డిపల్లె జట్టు, బ్లాక్ బుల్స్ జట్టు పోటీ పడ్డాయి. 4 వికెట్ల తేడాతో బ్లాక్ బుల్స్ జట్టు విజయం సాధించింది. మొదటి బహుమతిగా రూ.20,116, ట్రోఫీ, రెండవ బహుమతిగా రూ,10,116, ట్రోఫీ ప్రదానం చేశారు. స్థానిక సర్పంచ్ మధు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, ఉపసర్పంచ్ సోము, జాఫర్‌హుస్సేన్, భూపతి, సునీల్ కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందుకున్న విజేత జట్టు

గోనె సంచిలో మహిళ మృతదేహం

గుడుపల్లె: మండలంలోని ఓయస్ కొత్తూరు చెరువులో గోనె సంచిలో తేలుతున్న మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు.. ఓయస్ కొత్తూరు చెరువులో తెల్లటి సంచిలో మూట తేలుతుండగా స్థానికులు గుర్తించారు. మూటలో అవయవాలు కనబడడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చెరువు నుంచి మూటను వెలికి తీశారు. మూట విప్పి చూడగా సుమారు 25 సంవత్సరాల మహిళ మృతదేహం ఉంది. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమై ఉండడంతో, మృతి చెంది వారం అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చుట్టు పక్కల గ్రామాల్లో 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలు తప్పిపోయి ఉంటే సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.


చెరువు నుంచి శవం ఉన్న గోనె సంచి వెలికితీత